క్లుప్తంగా

ఆదిత్యునికి విశేష పూజలు



సూర్యనారాయణుడిని దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉన్న భారీ సప్త అశ్వవాహన ఏక చక్ర రథసారధి సమేత సూర్యనారాయణస్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామి చెంతన ఉదయం సూర్యనమస్కారాలు చేశారు. విశేష పూజలు నిర్వహించారు. భక్తులతో స్వామివారి ప్రాంగణం కిటకిట లాడింది.

నేడు బంగారమ్మతల్లి పరస



బంగారమ్మతల్లి

పెందుర్తి: మండంలోని గొరపల్లి పంచాయతీ కరకవానిపాలెంలో కొలువైన బంగారమ్మ తల్లి పరస సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం మీడియాకు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం తప్పెటగుళ్లు, కోలాటాలు, భజనలు ఉంటాయన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఆదిశంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

పెందుర్తి: మండలంలోని సరిపల్లి మల్లేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శివ శివానీ సహిత ఆది శంకరాచార్యుల ప్రతిమ ప్రతిష్టాపన మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు కమిటీ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, గోపూజ, దీక్షాధారణ, రుత్విగ్వరుణం, పంచగవ్యప్రాశన, జలాధివాసం, సాయంత్రం యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన చేస్తామన్నారు. రెండో రోజు మంగళవారం ధాన్యాధివాసం, గ్రామోత్సవ ఆరాధన జరుగుతాయని చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటలకు శివ శివానీ సహిత శంకరాచార్య ప్రతిమ, యంత్ర ప్రతిష్టా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

దుర్గమాంబ పండగ క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

పరవాడ: కలపాక గ్రామంలో వెలసిన శ్రీ దుర్గమాంబ పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లలపాలెంలో జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నీలో పరిసర గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. క్రీడాకారులకు గ్రామానికి చెందిన ఈపు అప్పలరాజు క్రికెట్ బ్యాట్లను బహూకరించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేలు చొప్పున ఈ నెల 13న బహుమతులు అందజేయనున్నారు. టోర్నమెంట్‌ను రమేష్, అప్పలరాజులు టాస్ వేసి ప్రారంభించారు.

గాయపడ్డ మిత్రుడికి ఆర్థిక సాయం



ఆనందం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం: తమతో కలిసి చదువుకున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో పూర్వ విద్యార్థులు ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించి, తమ మైత్రిని చాటుకున్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన శ్రీకాకుళపు ఆనందం ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తూరోడ్డు ప్రమాదానికి గురై, తీవ్రంగా గాయపడ్డాడు. కాలు విరగడంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న తన టెన్త్ బ్యాచ్(2005–06) విద్యార్థులు ఆనందం ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. తనకు అండగా నిలిచిన మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థులు గొంప లక్ష్మణ, గండి ఆలీ, జి.రమేష్, సీహెచ్ రాంబాబు, ప్రకాష్, గుదే నాగరాజు తదితరులు ఉన్నారు.

> ‘ప్రజా ప్రతినిధుల ఫొటోలు ప్రభుత్వ స్థలాల్లో పెట్టుకుని వాటి ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. భూ ఆక్రమణలు, అక్రమ మైనింగ్ విషయంలో మా ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుంది. ఓ రకంగా చెప్పాలంటే ప్రభుత్వ భూములకు మేం రక్షకులం. ఆక్రమణదారులు ఏ పార్టీ వారైనా ఉపేక్షించబోం. అలాంటి వారిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తాం. తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలి’– **నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల కబ్జాలపై ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాటలివి.**

- చీమలాపల్లిలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఎమ్మెల్యే అనుచరులమంటూ రెవెన్యూ అధికారులకు బెదిరింపులు
- అటువేపు కన్నెత్తి చూసేందుకు భయపడుతున్న రెవెన్యూ యంత్రాంగం



చీమలాపల్లి సర్వే నెం.50లోని ప్రభుత్వ భూమిలో అమ్మకానికి సిద్ధంగా చేపట్టిన నిర్మాణాలు

కొనసాగుతున్న.. ‘కూటమి’కబ్జాలు



కూటమి నాయకుల చెరలో సర్వే నెం.50లోని భూమి

పెందుర్తి: ‘నోరు మాట్లాడుతుంటే.. నొసలు వెక్కిరిస్తున్న’చందంగా ఉంది.. నియోజకవర్గంలో కూటమి నేతల తీరు. సమావేశాల్లో, మీడియా ముందు ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని చెప్తున్న ఈ నేతలే.. తమ అనుచరుల ఆక్రమణలను కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. తరచూ భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్తున్న ఎమ్మెల్యే పంచకర్ల తీరుకు భిన్నంగా ఆయన అనుచరులు వ్యవహరిస్తున్నారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి తెగనమ్ముకుంటున్నారు. రెవెన్యూ అధికారులు సైతం ఈ కబ్జాకాండకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.కోట్ల భూమికి ఎసరు

జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి సర్వే నెంబర్ 50(500 సచివాలయం పరిధి)లో దాదాపు 70 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇక్కడ నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నించినా.. అప్పటి అధికారులు అడ్డుకోవడంతో కబ్జాదారుల పాచికలు పారలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రభుత్వ భూమిపై కబ్జాదారులు పట్టుబిగించారు. ఎమ్మెల్యే అనుచరులమంటూ ఆక్రమణకు సిద్ధమయ్యారు. కొన్నాళ్లుగా ఈ భూమిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టి.. వాటిని రూ.లక్షలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ఈ కబ్జాకాండపై స్థానికులు జిల్లా, మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు కూడా కూటమి నాయకులకు దగ్గరుండి మరీ సహకారం అందిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ కబ్జాకాండపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించం. మా ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే కూడా ప్రభుత్వ భూముల సంరక్షణపై తగిన సూచనలు ఇస్తున్నారు. మా పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠినంగా ఉంటాం. చీమలాపల్లి సర్వే నెంబర్ 50లో ఏం జరుగుతోందో ఆరా తీస్తాం. మా దృష్టికి వచ్చిన ఆక్రమణలను నిరోధించి, వాటిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. – **ఎం.ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి**

ఆదిత్యునికి అభిషేకాలు



సుజాతనగర్‌లో పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: మాఘమాసోత్సవాల్లో భాగంగా సుజాతనగర్లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులతో పాయసం వండించి స్వామికి నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కిషోర్ మక్వాన



కిషోర్ మక్వానకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వాన ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో త్రినాథరావు అందించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో మాంగళ్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

టీడీఆర్‌లు తేల్చాకే విస్తరణ పనులు

బీఆర్‌టీఎస్ పనుల్ని అడ్డుకున్న గ్రామస్తులు



సీఈతో మాట్లాడుతున్న బాధితులు, స్థానిక నాయకులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి తొలి పావంచా నుంచి పాత అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పెండింగ్ పనులను బాధిత నివాసితులు కాసేపు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో పెండింగ్ పనులను జీవీఎంసీ అధికారులు ఆదివారం చేపట్టడంతో, అక్కడికి చేరుకున్న పలువురు బాధితులు, స్థానికులు కాంట్రాక్టర్‌ని టీడీఆర్‌ల కోసం నిలదీశారు. పనులను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ జీవీఎంసీ సీఈ శివప్రసాద్‌రాజుకి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సీఈ బాధితులు, స్థానికులతో మాట్లాడారు. బీఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ వల్ల తామంతా తీవ్రంగా నష్టపోయామని, టీడీఆర్‌లు చాలామందికి రాలేదని, వచ్చిన టీడీఆర్‌లను కూడా బ్లాక్‌లో పెట్టారని సీఈ దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని సీఈ తెలిపారు. పనుల్ని అడ్డుకుంటే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో బాధితులు కూడా కలెక్టర్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లేందుకు నిర్ణయించుకుని, అక్కడి నుంచి వెనక్కి మరలారు. పనులు యథావిధిగా మొదలయ్యాయి. అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, నివాసితులు కొలుసు ఈశ్వరరావు, ఎర్ర వరంబాబు, కర్రి అప్పలస్వామి తదితరులు బాధితుల తరఫున సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సామాజిక సంక్షేమం కోసం ఆనంద్ మేళా



కేక్ కట్ చేసి ఆనంద్ మేళాను ప్రారంభిస్తున్న ప్రాజెక్టు హెడ్ సమీర్ శర్మ, తదితరులు



బాలికలకు సైకిళ్లను అందిస్తున్న సమీర్ శర్మ

పరవాడ: భారతీయ వారసత్వాన్ని, సామాజిక సంక్షేమాన్ని పరిరక్షించాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్ సాధన క్రీడా మైదానంలో ‘ఎ ఫెయిర్ ఆఫ్ జాయ్ విత్ ఎ ఫ్యూజన్ ఆఫ్ కల్చర్ అండ్ కలర్స్’నినాదంతో శని, ఆదివారాల్లో నిర్వహించిన సింహాద్రి ఎన్టీపీసీ ఆనంద్ మేళా–2025ను మాజీ భద్రతా సలహాదారు వెంకట రవిరామ్ పిన్నింటితో కలిసి, ప్రారంభించారు. ఈ మేళాలో ప్రాంతీయ వంటకాలు, జానపద నృత్యాలు, సాంప్రదాయ కార్యకలాపాలతో సహా విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమ నిర్వహణలో దీపికా లేడీస్ క్లబ్ సహకారం ఎంతో కీలకమని సమీర్‌శర్మ కొనియాడారు. సీఎస్సార్ విభాగం ద్వారా ప్రతిభావంతులైన బాలికలకు సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతాశర్మ, సునీత పిన్నింటి, ప్రాజెక్టు ఉన్నతాధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు మాధవస్వామి జాతర

- ముత్యాలమ్మపాలెంలో కొలువైన మాధవస్వామి
- తీరంలో జాగరణ స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు





కొలువుదీరిన మాధవస్వామి, భక్తుల పుణ్యస్నానాలకు అనువైన ముత్యాలమ్మపాలెం తీరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో కొలువుదీరిన శ్రీ మాధవస్వామి తీర్థమహోత్సవానికి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. మంగళవారం రాత్రి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. తీర్థ మహోత్సవంలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. ముత్యాలమ్మపాలెం కూడలి నుంచి తీరం వరకు రంగు రంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు.

వేలాదిగా తరలిరానున్న భక్తులు

ఇక్కడ తీర్థ మహోత్సవంలో పాల్గొనేందుకు విశాఖ, అనకాపల్లి, సబ్బవరం, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, తోటాడ, వెంకటాపురం, భర్నికం, తానాం, లంకెలపాలెం, పెదముషిడివాడ, పరవాడ, దీపాంజలినగర్, వాడచీపురుపల్లి తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. బస్సులు, ద్విచక్ర వాహనాలపై మంగళవారం సాయంత్రానికే తీరానికి చేరుకుంటారు. రాత్రంతా తీరంలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక తిన్నెలపై ఆట పాటలతో జాగరణ చేస్తారు. జాగరణ చేసే భక్తుల కోసం ఉత్సవ కమిటీ తీరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. జాగరణ చేసిన భక్తులు బుధవారం సూర్యోదయాన తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని ఆలయంలో కొలువుదీరిన మాధవస్వామిని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు.

ఉచిత సేవలు.. ప్రత్యేక ఏర్పాట్లు

తీరంలో పుణ్య స్నానాలు ఆచరించే సమయంలో భక్తులు గల్లంతవకుండా పర్యవేక్షించేందుకు వీలుగా గజ ఈతగాళ్లను నియమించారు. భక్తులకు మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మహిళా భక్తుల కోసం తీరంలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలను పార్క్ చేయడానికి ముత్యమాంబ ఆలయం సమీపంలో ప్రత్యేక పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే భక్తుల కోసం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో నుంచి 10 అదనపు బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

భక్తులకు ప్రత్యేక సదుపాయాలు



మాధవస్వామి తీర్థ మహోత్సవంలో పాల్గొనే భక్తుల కోసం తీరంలో ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నాం. మహిళలకు తాత్కాలిక మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టాం. సముద్ర స్నానాలు చేసేవారి భద్రత దృష్ట్యా తీరంలో గజ ఈతగాళ్లను నియమించాం. భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ, ప్రసాదం అందజేయనున్నాం. మంగళవారం రాత్రి జాగరణ చేసే భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ వసతిని ఏర్పాటు చేశాం.

– **సూరాడ సోమునాయుడు, ఆలయ కమిటీ చైర్మన్**

ఇబ్బందుల్లేకుండా పటిష్ట చర్యలు



తీర్థ మహోత్సవంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు తీరంలో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరిస్తున్నాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. సముద్ర స్నానాలు చేసే భక్తుల కోసం మైకుల ద్వారా హెచ్చరికలు చేయడానికి సిబ్బందిని నియమిస్తున్నాం. తీరం వద్దకు వాహనాలను అనుమతించబోం. ముత్యమాంబ ఆలయం నుంచి భక్తులు కాలినడకనే తీరానికి వెళ్లాలి.

– **ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ**

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలి



లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలను కేటాయించి రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ గాజువాక నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని సంజీవగిరి కాలనీలో అర్హులైన లబ్ధిదారుల నుంచి ఆదివారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసినప్పటికీ స్థలాలు మాత్రం కేటాయించలేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు సదుపాయాలు కల్పించాలి

పెదగంట్యాడ మండలంలోని టిడ్కో లబ్ధిదారులకు వెంటనే సదుపాయాలు కల్పించాలని కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు టిడ్కో లబ్ధిదారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించలేదని, దీంతో వారికి బ్యాంకు రుణాలు చెల్లించాలనే ఒత్తిడి పెరిగిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని లేనిపక్షంలో ఈ నెల 12 నుంచి రిలే నిరాహారదీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అచ్యుతారావు, ఆనంద్, పెదపూడి దుర్గారావు, శివ, వనజాక్షి, పద్మ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు నష్టం కలిగితే సహించం



ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి నష్టం కలిగించాలని చూస్తే పోరాటం తప్పదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు అన్నారు. ఆదివారం స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లగా కాంట్రాక్ట్ కార్మికులు ఉక్కు ఉత్పత్తి కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్మికులను తొలగించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఒకవైపు పర్మనెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరిట పంపించి, మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించి ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందన్నారు. ఉత్పత్తిని పెంచి నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ద్రోహం చేస్తున్నాయన్నారు. కార్మికులందరూ మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కె.ఎం. శ్రీనివాస్, జి. శ్రీనివాసరావు, ఎస్. రమణ, సోమేష్, శశిభూషణ్, కృష్ణ, రమణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.